# సీఎం కేసీఆర్ హామీతో దళితుల్లో ఆనందం




- ఒకే విడుతలో దళిత బంధు మంజూరు చేస్తామనడంతో వికారాబాద్ నియోజకవర్గమంతటా హర్షాతిరేకాలు
- గ్రామగ్రామాన సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- ఊరూరా బీఆర్ఎస్‌కు జైకొడుతున్న దళితులు
- వికారాబాద్ నియోజకవర్గంలో 20,775 కుటుంబాలకు లబ్ధి
- మొదటి విడుతలో 100 కుటుంబాలకు దళిత బంధు యూనిట్లు మంజూరు
- వారికి నచ్చిన వ్యాపారాలతో ఆర్థికంగా బలోపేతమైన దళితులు

'వికారాబాద్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం, ఇక్కడ దళిత బిడ్డలు ఎక్కువగా ఉన్నారని నాకు తెలుసు, హుజూరాబాద్ మొత్తం నియోజకవర్గానికి దళిత బంధు పెట్టినం. అక్కడ ఫలితాలు బ్రహ్మాండంగా ఉన్నాయి. ఇప్పుడు దళితవాడలాగా లేదు, దొరల వాడ లాగా తయారైంది. బిజినెస్‌లు పెట్టి బ్రహ్మాండంగా చేసుకుంటున్నారు. ఎవడో ఎల్లయ్యగాడు గెలిస్తే వచ్చేది ఏం లేదని, ఆనంద్ గెలిస్తే ఒకే విడుతలో నియోజకవర్గంలోని కుటుంబాలకు దళిత బంధు మంజూరు చేస్తామని, దళిత కుటుంబాలు బంగారు కుటుంబాలు అవుతాయి' అని గురువారం వికారాబాద్ నియోజకవర్గ ప్రజాశీర్వాద సభ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీతో వికారాబాద్ నియోజకవర్గమంతటా దళిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వికారాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)

సమాజంలో అట్టడుగున ఉండే దళితుల బాగోగుల గురించి ఆలోచించే ఒకే ఒక్కరు సీఎం కేసీఆర్ అంటూ దళిత కుటుంబాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూరు, మర్పల్లి, వికారాబాద్, బంట్వారం, కోట్‌పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు నిర్వహించారు. ఒకే విడుతలో వికారాబాద్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాలన్నింటికీ దళిత బంధు యూనిట్లు మంజూరు చేస్తామన్న సీఎం హామీతో నియోజకవర్గమంతటా దళితులు బీఆర్ఎస్ పార్టీకి చెయ్యెత్తి జైకొడుతున్నారు.

ఇప్పటికే హుజురాబాద్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాలన్నింటికీ దళిత బంధు కింద వారు కోరుకున్న వ్యాపారాలు చేసుకునేందుకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయడంతో సంబంధిత కుటుంబాలన్నీ ఆర్థికంగా సుస్థిరంగా కావడంతోపాటు ఆయా వ్యాపారాలతో కొంతమందికి జీవనోపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి డాక్టర్ మెతుకు ఆనంద్ గెలవడం, బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే వికారాబాద్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాలందరికీ ఒకే విడుతలో దళిత బంధు పథకం కింద వారికి నచ్చిన వ్యాపారాలు చేసుకునేందుకు రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం చేయనుంది. దీంతో వికారాబాద్ నియోజకవర్గంలోని 20,775 దళిత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

### మొదటి విడుతలో 100 కుటుంబాలకు లబ్ధి

మొదటి విడుతలో వికారాబాద్ నియోజకవర్గంలో 100 దళిత కుటుంబాలకు దళిత బంధు పథకం కింద వారు ఎంపిక చేసుకున్న యూనిట్లను మంజూరు చేయడంతో సంబంధిత దళిత కుటుంబాల్లో వెలుగులు నిండాయి. గతంలో కూలీ పని చేసి జీవనోపాధి పొందినవారు.. దళిత బంధు పథకంలో భాగంగా ఆర్థిక సహాయం అందజేయడంతో రూ.10 లక్షల విలువ చేసే యూనిట్లు సొంతం కావడంతోపాటు దండిగా ఉపాధి పొందుతున్నారు. దళిత బంధు పథకంతో గతంలో కారు డ్రైవర్లుగా పనిచేసినవారు.. నేడు ఓనర్లు, గతంలో రోజు వారీ కూలీలు.. నేడు యజమానులయ్యారు. జిల్లాలో లబ్ధిదారులు మినీ డెయిరీ, పౌల్ట్రీఫామ్‌లతోపాటు కార్లు, ట్రాక్టర్ యూనిట్లను లబ్ధిదారులు ఎంపిక చేసుకున్నారు. లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యూనిట్లకు సంబంధించి ఆయా రంగాల్లోని నిపుణులతో ప్రత్యేక అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ కూడా ఇప్పించారు. దీంతో వారు ఎంపిక చేసుకున్న వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికంగా బలోపేతమై, మరింత మందికి ఉపాధి కల్పిస్తున్నారు.


ధారూరులో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, దళితులు

### మా బతుకులు బాగు చేస్తున్న సీఎం కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం

**- బేగరి రాజు, కెరెళ్లి, ధారూరు మండలం**



దళిత బంధుతో మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది. మూడు పూటల కడుపు నిండా భోజనం చేస్తూ జీవిస్తున్నాం. గతంలో మేము(భార్యాభర్తలం) రోజు కూలీ చేస్తూ మా ఇద్దరు పిల్లలను పోషిస్తుంటిమి. మాకు వ్యవసాయం చేసుకునేందుకు గుంట భూమి కూడా లేదు. నేను ప్రతి రోజూ అడ్డామీది కూలీపనికి వెళ్లేవాడిని. రోజూ పనిచేస్తేగాని జేబులో డబ్బులుండేవికావు. కనీసం హోటల్‌లో చాయి తాగడానికి కూడా డబ్బులుండేవి కాదు. దళిత బంధు పథకం ద్వారా రూ.10లక్షలు ఇచ్చారు. దీంతో నేను ట్రాక్టర్ కొన్నాను. ప్రస్తుతం ట్రాక్టర్‌తో ప్రతి రోజూ రూ.2-3 వేలు, సీజన్‌లో రూ.5-6 వేల వరకు వస్తుంది. ప్రస్తుతం దళిత బంధు పథకంతో మా ఇంటిల్లిపాది ఎలాంటి కష్టాలు లేకుండా ఉన్నాం. నియోజకవర్గంలోని దళిత కుటుంబాలందరికీ దళిత బంధు ఇస్తామని సీఎం హామీ ఇవ్వడం చాలా సంతోషం.

### దేశంలో ఎక్కడాలేని పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

**- చంద్రశేఖర్, మర్పల్లి మండలం**



దేశంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని పథకాలు అందిస్తున్న సీఎం కేసీఆర్.. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. వికారాబాద్‌లో గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు వరం ప్రకటించారు. సమాజంలో దళితులకు తరతరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని.. దారిద్ర్యాన్ని పారదోలేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సంతోషంగా ఉంది. కారు గుర్తుకే నా ఓటు. ఎమ్మెల్యేగా ఆనంద్‌ను గెలిపిస్తాం.

### దళిత బాంధవుడు కేసీఆర్

**- పెద్ద ఎల్లప్ప, అంతారం, ధారూరు మండలం**



గత ప్రభుత్వాలు దళితులను అణగారిన వర్గాలుగానే గుర్తించేవారు. కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్ దళితుల దీన పరిస్థితులను చూసి వారు ఆర్థికంగా ఎదుగాలనే ఉద్దేశంతో దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి దళితుల జీవితాల్లో వెలుగులు నింపి దళిత బాంధవుడయ్యాడు. ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా అర్హత కలిగిన వ్యక్తి ఖాతాల్లో రూ.10 లక్షలు జమచేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో అర్హత కలిగిన వారందరికీ ఒకే విడుతలో దళితబంధు ఇవ్వనున్నట్లు ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది.

### దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి

మర్పల్లి : దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని సర్పంచ్ ఇందిరా అశోక్ అన్నారు. దళిత కుటుంబాలందరికీ ఒకేసారి దళిత బంధు మంజూరు చేస్తామని వికారాబాద్‌లో గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రకటించడంతో శుక్రవారం పట్లూర్‌లో సర్పంచ్ ఇందిరా అశోక్, రొంపల్లిలో ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోట్‌మర్పల్లిలో సర్పంచ్ విజయలక్ష్మి రాచయ్య దళిత నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, గ్రామాధ్యక్షుడు అశోక్, మాజీ ఎంపీటీసీలు రవి, అంజయ్య, నాయకులు మోహన్, లాజర్, సునీల్ ఉన్నారు.

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

### దళిత బంధు పథకాన్ని ఒకే విడుతలో అందించడం చాలా అదృష్టం

**ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్

వికారాబాద్, నవంబర్ 24 : వికారాబాద్ పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రాకతో వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల గెలుపు దాదాపు ఖాయమైందని ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ ఎస్సీ రిజర్వు కావడంతో దళిత కుటుంబాలకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి, ఒకే విడుతలో రూ.10లక్షలు అందిస్తామని కేసీఆర్ చెప్పడం చాలా సంతోషకరమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద పథకాన్ని ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. రాబోయే రోజుల్లో వికారాబాద్ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని, ప్రజలు సుభిక్షంగా ఎలాంటి సమస్యలు లేకుండా జీవించగలుగుతారని పేర్కొన్నారు. సంవత్సరంలోగా లక్ష ఎకరాలకు సాగు నీటిని అందిస్తామని కేసీఆర్ చెప్పడంతో రైతులు అనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 30న ఎన్నికల సందర్భంగా మొదటి నంబర్ డాక్టర్ మెతుకు ఆనంద్, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోసారి వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే భాగ్యం కల్పించాలని ఎంపీ కోరారు. సమావేశంలో వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

### దళితుల బతుకుల్లో వెలుగులు

**- శ్రీనివాస్, సిద్దులూర్, వికారాబాద్**



దళిత బంధు లబ్ధిదారుడికి రూ.10లక్షలు ఒకేసారి అందజేయడం అద్భుతం. నిరుపేదలైన దళితులకు దళిత బంధు పథకం ప్రవేశపెట్టిన కేసీఆర్ సార్‌కు ధన్యవాదాలు. ఏ రాష్ట్రంలోనూ దళితులను ఇంతలా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. పేదరికంలో ఉన్న దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ సారు ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాగుంది.

### హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం

ధారూరు : వికారాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో నియోజకవర్గ పరిధిలోని దళిత కుటుంబాలకు ఒకే విడుతలో దళిత బంధు ఇస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో శుక్రవారం ధారూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో దళితులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఒకే విడుతలో ఎన్నో కుటుంబాలు బాగుపడాలని ఈ పథకం ప్రత్యేకత అని పార్టీ శ్రేణులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు రాజూనాయక్, ప్రధాన కార్యదర్శులు రాజుగుప్తా, అంజయ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రాములు, జైపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ధారూరు : ఎబ్బనూరులో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు


ధారూరు : మోమిన్‌కలాన్‌లో క్షీరాభిషేకం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు, దళితులు


ధారూరు : రుద్రారంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం..